సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రయోజనాల సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పోర్ట్ పూల్ కలాసీ యూనియన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: 30 ఏళ్లుగా పోర్టునే నమ్ముకున్నాం. తల్లిదండ్రుల వారసత్వ ఉద్యోగాలు, చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తున్నాం. పోర్టు పూల్ కలాసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు బేఖాతర్ చేయడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఓడ రేవుల మంత్రి సంతన్ టాకూర్‌ని ఎయిర్‌పోర్టులో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కేంద్ర మంత్రికి విన్నవించుకున్నామని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రధానితో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం పోర్టు సెక్రటరీ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పోర్ట్ పూల్ కళాసీ యూనియన్ నాయకుడు వాసుపల్లి రాంబాబు తదితరులు ఉన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



మహిళకు బియ్యం అందజేస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: పేదలకు 3 కేజీల బియ్యం చొప్పున 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అందజేశారు. ప్రతి నెల చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పేదల ఇళ్లకు వెళ్లి బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 25 మంది పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ప్రత్యేక దినాలలో కూడా బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది

అల్లిపురం: కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ముందుకు సాగుతుందని భారతీయ జనతా మజ్దూర్, బీజేఎంసీ జాతీయ చైర్మన్ బిశ్వ ప్రియరామ్, జాతీయ అధ్యక్షుడు అర్నబ్ చటర్జీ తెలిపారు. జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగిన బీజేఎంసీ విశాఖ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేఎంసీ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన కందేల శివగణేష్, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మిలకు వారు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం నూతన కమిటీ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సమాజంలో తనిఖీలు



ప్రేమ సమాజంలో వివిధ విభాగాలను తనిఖీ చేస్తున్న సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం డాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రేమ సమాజంలో గల వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సభ్యులను విచారించి, అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. వంట గదిని తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

యోగసిద్ధాంజనేయుడికి సింధూర అర్చన

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్‌లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి సింధూర అర్చన, తమలపాకులతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులచే సామూహికంగా సుందరకాండ పారాయణ చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నాడు వైభవం.. నేడు శిథిలం



హజ్రత్ సయ్యద్ ఆలీ ఇషాక్ మదీనా దర్గా మెట్ల మార్గం



జారి పడేలా తయారైన మెట్లు



600 ఏళ్ల చరిత్ర కలిగిన కోటవీధి దర్గా

- శిథిలావస్థలో వందల ఏళ్ల నాటి కోట వీధి దర్గా
- గత చరిత్రకు సాక్షీభూతమైన ఈ కట్టడాన్ని కాపాడాలని పలువురి వినతి
- పట్టించుకోని అధికారులు

దాబాగార్డెన్స్: విశాఖను.. అందునా పాతనగరాన్ని కాస్త శ్రద్ధతో పరికిస్తే చరిత్రను తమలో దాచుకున్న నిర్మాణాలు ఎన్నో కనిపిస్తాయి. ఇంకొంచం ఆసక్తి చూపితే.. గతాన్ని ముఖ్యంగా అప్పటి చారిత్రక పరిణామాలను అస్పష్టంగానైనా మన కళ్లెదుట నిలుపుతాయి. ఇంత గొప్ప స్మృతి చిహ్నాలు కాలక్రమంలో మరుగున పడిపోతున్నాయి. ఎన్నో నిర్మాణాలు పాలకులు, అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగా తెరమరుగైపోతున్నాయి. వాటిలో ఒకటైన కోటవీధి దర్గా (పోర్టు కొండపైన ఉన్న హజ్రత్ సయ్యద్ ఆలీ ఇషాక్ మదీనా దర్గా) అభివృద్ధి కొరవడిన కారణంగా దయనీయ స్థితికి చేరుతోంది.

ప్రాచీన కట్టడాలు.. : పాతనగరంలో అనేక నిర్మాణాలు వందేళ్లకు పైగా చరిత్ర ఉన్నవి. వీటిలో కొన్ని మాత్రం మరీ ప్రాచీనమైనవి. పోర్టు ప్రాంతంలోని కొండపైన ఉన్న హజ్రత్ సయ్యద్ ఆలీ ఇషాక్ మదీనా దర్గా ఉంది. నగరంలోని అతి పురాతనమైన ఈ దర్గాకు 600 ఏళ్లకు పైబడే చరిత్ర ఉంది. ఎవరికీ పట్టని కారణంగా దీనావస్థకు చేరుతోంది. మెట్ల మార్గం సరిగ్గా లేకపోవడంతో దర్గాకు వెళ్లేందుకు కొంత మంది ముస్లింలు అవస్థలు పడుతున్నారు. విశ్రాంతి భవనం శిథిలమైంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న పరిస్థితి నెలకొంది. సుమారు 600 ఏళ్ల కిత్రం నిర్మించిన దర్గా అధ్వాన్నంగా తయారైంది. ఇక్కడికి వచ్చేవారికి కనీస సౌకర్యాలు కానరావడం లేదు. మెట్ల మార్గం పురాతనమైనది కావడంతో తరచూ రాళ్లు తేలిపోతున్నాయి. దర్గాకు వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇరుకైన మెట్ల మార్గం కావడంతో ఉత్సవాలు జరిగే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు.



మధ్యలో నిలిచిపోయిన విశ్రాంతి భవనం పనులు



అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంక్

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాలంటే..

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాలంటే మెట్ల మార్గం ఉండగానే రోడ్డు మార్గం వేయాలి. కనీసం టూ/త్రీ వీలర్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తే రాష్ట్రంలోనే అతి పురాతన దర్గా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

– ముజీబ్‌ఖాన్, స్థానికుడు, 39వ వార్డు

మౌలిక సదుపాయాలు కరువు..

విశాఖలో అతి పురాతనమైన దర్గా వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఉత్సవాల సమయంలో అత్యధిక సంఖ్యలో వస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి. అందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని నిధులు విడుదల చేయాలి.

– అక్రమ్, కోటవీధి, 39వ వార్డు

మంత్రి మండలి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

దాబాగార్డెన్స్: కుల గణాంకాల కోసం కేంద్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆలిండియా ఓబీసీ (జ్యోతిబాపూలే) సంఘం జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో కుల గణాంకాల కోసం న్యాయపోరాటం చేశామని, తాను దాఖలు చేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌లో సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిందన్నారు. న్యాయ పోరాటంతో పాటు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు, సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ విషయమై రాహుల్‌గాంధీ, జేపీ నడ్డా, సుప్రియా సూలే వంటి ప్రముఖ నేతలను కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఉద్యమాలు ఫలప్రదమయ్యాయన్నారు. తనతో పాటు అనేక సంఘాలు ఈ ఉద్యమంలో భాగస్వామ్యమయ్యాయని తెలిపారు. ఓబీసీల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ప్రతి వెనుకబడిన కులానికి వారి జనాభా నిష్పత్తి ఆధారంగా కొత్త పథకాలు ప్రవేశపెట్టాలన్నారు.

అవినీతి నిరోధమే లక్ష్యం



పోస్టర్ విడుదల చేస్తున్న చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ ప్రకాష్ తదితరులు

మహారాణిపేట: అవినీతి నిరోధానికి ముందస్తు చర్యలపై ప్రజలు, ఉద్యోగుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో విశాఖ పోస్టల్ డివిజన్ ప్రత్యేకంగా విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. దీనిపై వెలంపేట హెడ్ పోస్టల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ జనరళ్లు డీఎస్‌వీఆర్ మూర్తి, పి.ఉపేంద్ర, డైరెక్టర్ (హెడ్‌క్వార్టర్స్) గజేంద్ర కుమార్ మీనా, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీసు పి.కోమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు

అమ్మవారికి లక్ష కుంకుమార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరిగిన లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.10 వేలు చెల్లించినచో వారి తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని పేర్కొన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించాలి. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తకాల అమరికపై అవగాహన



పుస్తకాల అమరికపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

దాబాగార్డెన్స్: గ్రంథాలయ వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజు వీధి బాలల శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయంలో పుస్తకాల అమరిక, క్యాట్ లాగ్‌పై గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి అవగాహన కల్పించారు. అలాగే రిసోర్స్‌పర్సన్ పి. యల్లయ్య తెలుగు పద్యాలు నేర్పించారు. అనంతరం పిల్లలచే ఆటలు ఆడించారు. కార్యక్రమంలో 38 మంది పిల్లలు పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో..

జగదాంబ జంక్షన్ సూర్యాబాగ్‌లో గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రాజేంద్ర వర్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబందీ



చావులమదుం జంక్షన్‌లో కార్లు సోదా చేస్తున్న టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు తదితరులు



ట్రిపుల్ రైడింగ్‌లో వెళ్తున్న యువకులను ఆపుతున్న సీఐ

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. చావులమదుం, జగదాంబ జంక్షన్, జైలురోడ్డు ప్రాంతాల్లో సీపీ వీవీసీఎం ఎర్రంనాయుడు, సీసీఎస్ సీఐ కోరాడ రామారావు, ఎస్ఐ ఎన్.సింహాచలం, సీసీఎస్ ఎస్ఐ జె. తిరుమలరెడ్డి తమ సిబ్బందితో ద్విచక్ర వాహనాలు, కార్లు, భారీ వాహనాలను తనిఖీ చేశారు. నాకా బందీలో ట్రిపుల్ రైడింగ్ 3, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 15 కేసుల నమోదు చేసినట్లు సీఐ ఎర్రంనాయుడు తెలిపారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం

జగదాంబ: పండావీధి దరి దుర్గమాంబ సమాజం వీధిలో విద్యుత్ స్తంభం తుప్పు పట్టి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఏళ్ల నాటిది కావడంతో కాలక్రమేణా స్తంభం కింద భాగం తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకుంది. అంతే కాకుండా స్తంభం కింద సిమెంట్ దిమ్మ కూడా శిథిలమైపోవడంతో స్తంభం గాలికి ఊగిసలాడుతుంటుంది. దీంతో ఇది ఎప్పుడు కూలిపోతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పాత స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



దుర్గమాంబ సమాజం వీధిలో ఉన్న విద్యుత్ స్తంభం



తుప్పు పట్టి పక్కకు ఒరిగి పోయిన స్తంభం కింది భాగం

పలు విభాగాలపై మేయర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాస్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ మెకానికల్ విభాగంపై మేయర్ పీలా శ్రీనివాస్ మంగళవారం తన ఛాంబర్లో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రికల్ వాహనాలతో పాటు జీవీఎంసీ సొంత వాహనాలు, అద్దె వాహనాలు ఎన్ని ఉన్నాయి. వాటిని ఏ అధికారులకు కేటాయించారంటూ ఆరా తీశారు. జీవీఎంసీ 8 జోన్లలో వ్యర్థాలు తరలించే వాహనాలు ఎన్ని ఉన్నాయి. వాటి నిర్వహణ, ఎన్ని ట్రిప్పులు వ్యర్థాలు తరలిస్తున్నాయి. జేసీబీలు, లోడర్లు, బాబ్ క్యాట్లు, క్లాప్ వాహనాలు, బీచ్ క్లీనింగ్ యంత్రాలు తదితర వాహనాలు ఎన్ని ఉన్నాయి? అవి నిర్వహించే పనితీరుపై జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీరు (మెకానికల్) గోవిందరావును అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజలకు అందించే తాగునీరు, వీధి దీపాల నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ విభాగంపై నిర్వహించిన సమీక్షలో ప్రజలకు అందించే మౌలిక సదుపాయాల్లో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని, వీధి దీపాల నిర్వహణపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నందున వార్డు సచివాలయ పరిధిలోని సచివాలయ కార్యదర్శులు గమనించి సకాలంలో మరమ్మతులు చేపట్టి ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు.

నేడు కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి



కన్యకా పరమేశ్వరి

దాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి 1075వ జయంతి నిర్వహించనున్నారు. వేకువ జాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం, అమ్మవారికి సువర్ణ వస్త్రాలంకరణ, స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజా కార్యక్రమం, 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవీ మూల మంత్ర హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన, సాయంత్రం 5 గంటలకు జగదాంబ జంక్షన్ మహారాణిపేట అంబికాబాగ్ రామాలయం నుంచి జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్ మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర చేపట్టనున్నారు. శోభాయాత్రలో మహిళలు, పురుషులు ఒకే రకమైన దుస్తులతో 108 రకాల సుగంధ ద్రవ్యాలు, కలశాలతో శోభాయాత్రలో పాల్గొననున్నారు.

మండే ఎండలు



ప్రశాంతంగా ఆర్టీసీ కాంప్లెక్స్ బస్టాప్

దాబాగార్డెన్స్: భానుడు భగభగమన్నాడు. నడినెత్తిన చుర్రుమన్నాడు. నగర జీవిని హడలెత్తించాడు. నిప్పులు కురిపించి బెంబేలెత్తించాడు. దీంతో నగర జీవి విలవిలలాడాడు. మండుటెండను తట్టుకోలేక రోడ్డు మీద ఎవరూ కనిపించలేదు. తప్పని పరిస్థితుల్లో పనులపై బయటికి వెళ్లాల్సి వచ్చిన వారు నానా అవస్థలు పడ్డారు. నెత్తిన గొడుగులు, ముఖానికి ముసుగులు వేసుకుని వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రయత్నించారు. మొత్తం మీద భానుడి ప్రతాపానికి జన సంచారం కానరాలేదు. దాంతో నగర వీధులన్నీ బోసిపోయాయి. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు డీలా పడ్డారు. రోజంతా ఇంటిపట్టున ఉన్న జనం కాస్త చల్లబడ్డాక బయటికి వచ్చారు.



వాహనాలతో నిత్యం కళకళలాడే సంగం శరత్, డైమండ్ పార్క్ రూట్ ఇలా..



సబ్‌వే.. ఫ్లైఓవర్ ఇలా..

నిప్పుల కొలిమి..

వారం.. పది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండ వేడిమి తట్టుకోలేక వృద్ధులు సన్‌స్ట్రోక్ (వడదెబ్బ)కి గురవుతున్నారు. వారం రోజులుగా 32 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతూ వస్తున్నాయి.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పోరాటానికి డీవైఎఫ్ఐ మద్దతు

సీతంపేట: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వోలు) చేస్తున్న పోరాటానికి మంగళవారం డీవైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ మద్దతు తెలియజేసింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీహెచ్‌వోలు చేస్తున్న నిరసన దీక్షలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు ప్రసంగిస్తూ గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను వేధించడం తగదు అన్నారు. వారి న్యాయమైన డిమాండ్లు అయిన ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారి ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని, 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, గత ఏడు నెలలుగా బకాయి ఉన్న ఇన్సెంటివ్‌లు చెల్లించాలని, ఈఈఎఫ్‌వో పునరుద్ధరించాలని, ఎఫ్ఆర్ఎస్‌లో మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సంతోష్ కుమార్, ఉమా శైలజ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల దీక్షకు మద్దతు తెలుపుతున్న డీవైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షుడు రాజు

మృతుని భార్యకు చెక్కు అందజేత

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో విధులు నిర్వర్తిస్తూ, ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీలో సభ్యుడిగా ఉన్న కిలాని గవరరాజు (హెల్త్ వర్కర్) మృతి చెందాడు. సొసైటీ సభ్యుడిగా ఆయనకు అందాల్సిన చెక్కును మేయర్ పీలా శ్రీనివాస్ చేతుల మీదుగా గవరరాజు భార్య కిలాని వరలక్ష్మికి సొసైటీ అధ్యక్షుడు వీవీ వామనరావు నేతృత్వంలో మంగళవారం రూ.2 లక్షల 83 వేల 826 చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కిలాని గవరరాజు సొసైటీ సభ్యుడు అయినందును సొసైటీలో ఉన్న ఇన్సూరెన్స్ పథకం కింద అతని రుణం పూర్తిగా రద్దు చేయడమే కాక భార్యకు చెక్కు అందజేశామన్నారు. జీవీఎంసీ ఉద్యోగులు కో ఆపరేటివ్ సొసైటీని సక్రమంగా నిర్వహించుకుంటే సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వీవీ వామనరావు, కోశాధికారి బి. తాతారావు, సొసైటీ మేనేజర్ యర్రా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మేయర్ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు వామనరావు

శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ

సీతంపేట: గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ రచించిన శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ కార్యక్రమం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో మంగళవారం జరిగింది. ప్రొఫెసర్ కె.సి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ నేటి సమాజానికి అవసరమైన ఆలోచనాపరుడు, తత్వవేత్త అని కొనియాడారు. బాలమోహన్‌దాస్ రచించిన సంకలనంలో విభిన్న రంగాలకు సంబంధించిన విషయాలను కూలంకషంగా పొందుపరిచారని తెలిపారు. రచయిత తన కెరీర్‌లో అనుసరించిన సూత్రాలను ఈ సేకరణలో పొందుపరిచినట్లు తెలిపారు. సభాధ్యక్షుడు, బుల్లయ్య కళాశాల సెక్రటరి జి. మధుకుమార్ మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ సమాజాన్ని మేధోసంపత్తితో సుసంపన్నం చేసే దిశగా వ్యాసాలను పొందుపరిచి విలువైన సంపుటిగా తీర్చిదిద్దారని కొనియాడారు. భవిష్యత్ తరాలకు ఈ వ్యాసాలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. బొబ్బిలి రాజా కళాశాల మాజీ ఆంగ్ల విభాగాధిపతి వినయభూషణరావు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆండాల్ అమ్మిశెట్టి, డాక్టర్ కె.కుమార్‌రాజా, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.